క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని ఆయా గ్రామాల్లో జిల్లా అధికారులు పర్యటించి, అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం వారిని స్థానిక ప్రజాప్రతినిధులు సన్మానించారు. అదనపు కలెక్టర్ శ్రీ మను చౌదరి, డీఎస్పీ జగన్నాథరెడ్డి, ఎంపీవో రాము, సర్పంచ్ వెంకటరమణ, బాద్యనాయక్, గంగమణి ఉన్నారు.

సమయ పాలన పాటించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఉద్యోగులు సమయ పాలన పాటించాలని ఆర్డీవో భుజంగ రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. మండలంలో ఉన్న సమస్యలు, పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీలో చేరిక



కామారెడ్డి అర్బన్: పట్టణంలో శనివారం పలువురు యువకులు ఆమ్ ఆద్మీ పార్టీలో చేరినట్లు పార్టీ జిల్లా కన్వీనర్ మదన్‌లాల్ జాదవ్ తెలిపారు. వారిని వివిధ హోదాల్లో నియమించినట్లు పేర్కొన్నారు. కే.నర్సింలు ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ అధ్యక్షుడుగా, యేసుదాసును ప్రధాన కార్యదర్శి, అరుణ్ సదాశివనగర్ మండల అధ్యక్షుడుగా, కిరణ్ ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు వివరించారు. నాయకులు వినోద్‌నాయక్, సురేష్, శివకుమార్, మోహన్, ఖలీల్‌వుల్లా పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై జాగ్రత్తగా ఉండాలి



రామారెడ్డి: ప్రజలు డెంగీ వ్యాధిపై జాగ్రత్తగా ఉండాలని ఆయుర్వేదిక్ వైద్యాధికారి చైతన్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం ఆయన డెంగీ నివారణ కోసం ఆయుర్వేదిక్ మందులు అందించారు. అనంతరం ఆయుష్ కరదీపికలను ఆవిష్కరించారు. సిబ్బంది శ్రీహరి, శ్రీధర్, సూపర్ వైసర్ జానకమ్మ, స్వాతి, రజిత పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా



బాన్సువాడ: ఆర్టీసీ బిల్లును గవర్నర్ వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేస్తూ శనివారం బాన్సువాడ డిపో ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. ఉదయం రెండు గంటల పాటు బస్‌లను బంద్ చేసి నిరసన చేపట్టారు. కార్మికులు నాగరాజు, గిరిధర్, రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఈవీఎంలపై అవగాహన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్‌లో శనివారం గ్రామస్తులకు ఈవీఎంలతో ఓటుహక్కు వినియోగంపై అధికారులు అవగాహన కల్పించారు. ఈవీఎం పనితీరును వారు గ్రామస్తులకు వివరించారు. ఎల్లారెడ్డి ఎంపీవో శ్రీనివాస్, సర్పంచ్ గంగమణి, ఉపసర్పంచ్ అంజయ్య, పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



పిట్లం(జుక్కల్): మండలంలోని చిల్లర్గి గ్రామంలో శనివారం మండల పశువైద్యాధికారి సంతోష్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పశువులకు నట్టల నివారణ మందులు వేశారు. సర్పంచ్ రమేష్, వైస్ ఎంపీపీ లక్ష్మరెడ్డి, గోపాల మిత్ర అహ్మద్ రైలులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు చేసుకునేదెట్లా?

- లింగంపేటలో మూతబడిన కేంద్రం
- సాంకేతిక సమస్యతో కొనసాగని వైనం
- పట్టించుకోని అధికారులు



లింగంపేటలో మూతబడిన ప్రభుత్వ ఆధార్ కేంద్రం

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రతీ తహసీల్దార్ కార్యాలయంలో నూతన ఆధార్ కార్డుల కోసం, ఆధార్ కార్డులలో మార్పులు, చేర్పుల కోసం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కానీ మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి అనుసంధానం చేసిన ఆధార్ సెంటర్ గత కొన్ని నెలలుగా మూతపడింది. దీంతో మండల ప్రజలు ఆధార్ నమోదు చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. సాంకేతిక సమస్యతో కేంద్రాన్ని మూసివేసినట్లు సమాచారం.

ఇతర మండలాలకు వెళ్తున్న ప్రజలు..

స్థానికంగా ఆధార్ కేంద్రం ఉంటే మండల ప్రజలకు ఆధార్‌లో నెలకొన్న సమస్యలు రూ.50 ఖర్చుతో పరిష్కారం అయ్యేది. కానీ లింగంపేటలో ఆధార్ కేంద్రం మూతపడటంతో వారు తాడ్వాయి, ఎల్లారెడ్డి, గాంధారి, కామారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాలకు వెళ్లాల్సివస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రయాణ ఖర్చులు సుమారు రూ. 500 నుంచి రూ. 1000 వరకు అవుతుండటంతోపాటు సమయం కూడా వృథా అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క రోజులో సమస్య పరిష్కారం కాకపోతే రెండుమూడు రోజులు తిరగాల్సి వస్తుందని వాపోతున్నారు. మండలంలో 36 గ్రామాలు, 36 తండాలతో 41 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండలంలో 47,915 ఓటర్లు, 67,000కు పైన జనాభ ఉన్నారు. ప్రతీరోజు ఆధార్ లింకు, పుట్టిన తేదీ మార్పు, మొబైల్ నంబర్ మార్పు, ఇంటిపేరు, గ్రామం పేరు, ఇంటి నంబరు మార్పు, బయోమెట్రిక్ అప్‌డేషన్ కోసం చిన్నారుల నుంచి వృద్ధుల వరకు నిత్యం ఆయా మండలాలకు వందలాదిగా తరలివెళ్తున్నారు.

లింగంపేట ఆధార్ కేంద్రంలో సాంకేతిక లోపం తలెత్తడంతో సేవలు నిలిపివేశారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు వివరించినా నేటికీ సమస్యను పరిష్కరించడంలేదని బాధితులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆధార్ కేంద్రంలో సాంకేతిక సమస్యను పరిష్కరించి, కేంద్రాన్ని పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆధార్ సెంటర్‌ను తెరవాలి



ఆధార్‌లో నా మొబైల్ నంబరు మార్చుకోవడానికి నెల రోజులుగా ఎదురు చూసినా లింగంపేట ఆధార్ కేంద్రం తెరుచుకోలేదు. దీంతో తాడ్వాయికి వెళ్లగా సమస్య పరిష్కారమయింది. లింగంపేట ఆధార్ సెంటర్‌ను త్వరగా బాగుచేసి, సేవలు పునరుద్ధరించాలి.

–బొల్లు జశ్వంత్, లింగంపేట

పనులు మానుకొని తిరిగాను..



నా కుమారుడి ఆధార్ కార్డులో చిరునామాలో తప్పు ఉండటంతో, మార్పు కోసం మూడు రోజులు ఎల్లారెడ్డికి తిరగాల్సి వచ్చింది. పనులు మానుకొని తిరగడంతో సమయం వృథాతో పాటు డబ్బులు ఖర్చు అయ్యాయి.

–ఆజాం, లింగంపేట

త్వరలో బాగుచేయిస్తాం..

మీ సేవా కేంద్రంలో సాంకేతిక లోపం రావడంతో సేవలు నిలిచిపోయాయి. సాంకేతిక లోపం సరి చేయాలని జిల్లా అధికారులకు సమస్య వివరించాం. బాధితులు చాలా మంది ఇతర మండలాలకు వెళ్తున్నట్లు తెలిసింది. మరోసారి సమస్యను ఉన్నతాధికారులకు వివరించి బాగుచేయిస్తాం.

–చంద్ర రాజేశ్వర్, తహసీల్దార్, లింగంపేట

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి



దేవునిపల్లిలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

కామారెడ్డి రూరల్: విద్యార్థుల సామర్థ్యాలు పెంచి, వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని, మండల నోడల్ అధికారి విజయ్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. దేవునిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని ఉపాధ్యాయులకు గణితం సబ్జెక్టుపై కనీస సామర్థ్యాల బోధన వంటి అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వహించాలని విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సిబ్బంది శివప్రసాద్, వెంకట్, మధుకర్, కాళీదాస్ పాల్గొన్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా మౌలిక భాష గణిత సామర్థ్యాల సాధనపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవో రామస్వామి మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయిలో ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. డీఆర్పీలు మహిపాల్, చంద్రశేఖర్, మండల నోడల్ అధికారి సాయన్న తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కిన జీపీ కార్మికులు



మద్నూర్‌లో సెల్ టవర్ ఎక్కిన కార్మికులు



తాడ్వాయిలో సమ్మె చేస్తున్న కార్మికులు

మద్నూర్: తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ శనివారం గ్రామ పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలోని సెల్‌ఫోన్ టవర్ పైఎక్కి నిరసన వ్యక్తం చేశారు. ఎస్సై కృష్ణారెడ్డి, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని, వారిని కిందికి దిగాలని కోరారు. మాజీ సింగిల్ విండో చైర్మన్ విజయ్ వారికి భరోసానివ్వడంతో కార్మికులు దిగివచ్చారు.

కొనసాగుతున్న సమ్మె..

తాడ్వాయి: మండల కేంద్రంలో శనివారం జీపీ కార్మికుల సమ్మె కొనసాగింది. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని కార్మికులు పేర్కొన్నారు.

సంక్షిప్తం

తిరుపతికి తరలిన బీసీ సంఘ నాయకులు

కామారెడ్డి అర్బన్: ఈనెల 7న తిరుపతిలో నిర్వహించబోయే అఖిల భారత జాతీయ ఓబీసీ 8వ మహాసభకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు ఆధ్వర్యంలో పలువురు బీసీ నాయకులు శనివారం తరలివెళ్లారు. నాయకులు మోహనాచారి, నారాయణరావు, రాజయ్య, నర్సింగ్, దయాకర్, నగేష్, ఉన్నారు.

సీసీ స్లాబ్ పనులు ప్రారంభం

కామారెడ్డి రూరల్: పట్టణ పరిధిలోని సరంపల్లి గ్రామంలో మామిండ్ల, ముల్క సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న లస్మమ్మ ఆలయ సీసీ స్లాబ్ నిర్మాణ పనులను శనివారం కామారెడ్డి నియోజకవర్గ బీజేపీ కాటిపల్లి వెంకటరమణరెడ్డి ప్రారంభించారు. గ్రామ అధ్యక్షుడు రాజు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

గాంధారి(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి రూ.1.61 కోట్లు మంజూరు అయినట్లు ఏఎంసీ చైర్మన్ సత్యంరావ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ఆలయ ప్రహరీకి భూమిపూజ

బాన్సువాడ రూరల్(బాన్సువాడ): మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో వీరాంజనేయ స్వామి ఆలయ ప్రహరీ నిర్మాణం కోసం శనివారం సర్పంచ్ మాలెపు నారాయణరెడ్డి భూమిపూజ చేశారు. గ్రామ పెద్దలు తదితరులున్నారు.

కండ్ల కలక నివారణ మందు పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంతో పాటు అచ్చంపేట ఎస్సీ గురుకులానికి శనివారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కండ్ల కలక నివారణ మందులు, అద్దాలను పంపిణీ చేశారు. ఐఆర్‌సీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి, సభ్యులు తదితరుల ఉన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టండి

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఈద్గా వద్ద అభివృద్ధి పనులను చేపట్టాలని మసీద్ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం వారు జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు విజయ్‌కు వినతిపత్రం అందజేశారు.

కొనసాగుతున్న దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్‌ఎన్ ఫ్యాక్టరీ విడుదల చేస్తున్న వ్యర్థాల నుంచి కాపాడాలంటూ మండలంలోని కాచాపూర్ గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు శనివారం 103వ రోజు కొనసాగాయి. దీక్షలో గ్రామానికి చెందిన పలు కుల సంఘాల ప్రతినిధులు కూర్చుని నిరసన తెలిపారు.

డీఎస్పీ, ఎస్సైలకు సన్మానం



కామారెడ్డి రూరల్: కామారెడ్డి డీఎస్పీ ప్రకాష్, దేవునిపల్లి ఎస్ఐ రాజులను శనివారం కామారెడ్డి మండల బీజేపీ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆనంద్‌రావు, శ్రీధర్, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, రవి, పోషయ్య, మాసు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

డబ్బుల కోసం బెదిరింపులు

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన నిమ్మ శ్రీనివాస్ బ్యాంకు ఖాతాలో అనుకోకుండా కొద్ది రోజుల క్రితం రూ. 1లక్ష, 40 వేలు జమ అయ్యాయి. నెఫ్ట్, డిస్ట్రిక్ ట్రెజరీ, హైదరాబాద్ అనే పేరుతో నగదు జమ కాగా, పలువురికి ఈ విషయం తెలిపాడు. దీంతో సదరు వ్యక్తులు అతడి వద్ద నుంచి అప్పుగా కొంత నగదు తీసుకున్నారు. మరికొందరు డబ్బుల కోసం బెదిరిస్తున్నారన్నారని శనివారం శ్రీనివాస్ తెలిపారు. కాగా ఈ విషయంలో జిల్లాస్థాయి అధికారులు విచారణ జరిపితే వాస్తవాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కామారెడ్డి టౌన్: పట్టణంలోని స్వర్ణకార కాంప్లెక్స్ వద్ద విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఆ ఏరియాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. తిలక్‌రోడ్, ముష్రీఫ్‌బాగ్, సుభాష్‌రోడ్, మాయాబజార్ ఏరియాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

తెరవే సామాజిక కవి సమ్మేళనం

కామారెడ్డి అర్బన్: ఆచార్య జయశంకర్‌సార్ జయంతి సందర్భంగా తెలంగాణ రచయితల వేదిక(తెరవే) ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు కామారెడ్డి కర్షక్ బీఎడ్ కళాశాలలో సామాజిక సమస్యలపై కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెరవే అధ్యక్ష, కార్యదర్శులు గఫూర్ శిక్షక్, అల్లిమో హన్‌రాజ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ కవితలు వినిపించిన వారికి ప్రశంసాపత్రాలు ప్రదానం చేస్తామన్నారు.

బీబీపేటలో ఆధ్యాత్మిక గ్రామచైతన్యం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి గీతామందిరం సత్సంగ్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక గ్రామ చైతన్యం కింద ఆదివారం ఉదయం బీబీపేట వాసవీక్లబ్‌లో జ్ఞాన చైతన్య స్వామి ధార్మిక ఉపన్యాసం, ప్రవచనాలుంటాయని సత్సంగ్ ప్రధాన కార్యదర్శి అర్వపల్లి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బీబీపేట, పరిసర గ్రామస్తులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఎంపీపీకి సన్మానం



కామారెడ్డి రూరల్: విదేశీ పర్యటన ముగించుకొని కామారెడ్డికి తిరిగి వచ్చిన మండల పరిషత్ అధ్యక్షుడు పిప్పిరి ఆంజనేయులును శనివారం ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో మలహరి, పరిషత్ కార్యాలయ సిబ్బంది సన్మానించారు. గ్రామ కార్యదర్శులు శ్రీనివాస్, గణేష్, అనిల్, శ్రీనివాస్, సంతోష్, అరవింద్, బాల్‌రాజు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మద్నూర్(జుక్కల్): మద్నూర్ పట్టణ బిజినెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దరాస్‌వార్ సాయిలు, ఉపాధ్యక్షుడిగా ఉడుతావార్ సురేష్, అవార్ పండరి, ప్రధాన కార్యదర్శిగా రచ్చ కుషాల్, కార్యదర్శిగా నాగ్‌నాథ్, కోశాధికారిగా వ్యాస్ సంతోష్‌లను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లనుంచి పెట్రోల్ చోరీ

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మహమ్మద్‌నగర్ బస్టాండ్ ప్రాంతంలో పార్కింగ్ చేసిన సుమారు ఏడు బైక్‌ల నుంచి శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ చోరీ చేశారు. రాత్రి వేళ పోలీసుల పెట్రోలింగ్ లేకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని బాధితులు ఆరోపించారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించారు.

ఇన్‌స్టాగ్రాం ఫేక్ అకౌంట్‌తో మోసం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పొల్కంపేట గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ చత్రం రామానుజాచారిపై గుర్తుతెలియని వ్యక్తులు ఇన్‌స్టాగ్రాంలో ఫేక్ అకౌంట్ సృష్టించి, డబ్బులు పంపాలని పలువురికి మెసేజ్‌లు పంపిస్తూ డబ్బులు కాజేస్తున్నట్లు శనివారం పేర్కొన్నారు. ఈ విషయమై లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ముర్రుపాలలో రోగ నిరోధక శక్తి





నస్రుల్లాబాద్‌లో సీమంతాలను నిర్వహిస్తున్న అధికారులు.. మహమ్మదీనగర్‌లో..

నస్రుల్లాబాద్/నిజాంసాగర్/కామారెడ్డి టౌన్/సదాశివనగర్/నాగిరెడ్డిపేట: ముర్రుపాలలో రోగ నిరోధక శక్తి ఉంటుందని, పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు సూచించారు. జిల్లాలోని పలు మండలాల్లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. నస్రుల్లాబాద్‌లో సూపర్ వైజర్ వాణి మాట్లాడుతూ.. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అలాగే నిజాంసాగర్ మండలం మహ్మద్‌నగర్‌లో సూపర్‌వైజర్ రాజేశ్వరి మాట్లాడారు. సదాశివనగర్‌తోపాటు అడ్లూర్‌ఎల్లారెడ్డిలో పీహెచ్ సీ వైద్యాధికారిణి ఆస్మ అఫ్షిన్ మాట్లాడారు. నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట రైతువేదికలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట మండలాలకు చెందిన ఐసీడీఎస్ సిబ్బందితో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.



సదాశివనగర్‌లో..



నాగిరెడ్డిపేటలో..

కొనసాగుతున్న స్వీపర్ల రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో నినాదాలు చేస్తున్న స్వీపర్లు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 41వ రోజు కొనసాగాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని, లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం వారికి మద్దతు తెలిపారు.

మద్నూర్ బంద్ ప్రశాంతం



ఎస్సైకి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

మద్నూర్(జుక్కల్): గ్రామస్తుల పిలుపు మేరకు మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలు, హోటళ్లు శనివారం బంద్ పాటించాయి. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మండలంలోని అంతాపూర్ గ్రామంలో శుక్రవారం రెండు వర్గాల మధ్య గొడవ జరుగగా.. పెద్ద ఎక్లారకు చెందిన ప్రదీప్ పటేల్ అనే వ్యక్తి మద్నూర్ గ్రామస్తులు ఏం చేస్తారని దుర్భాషలాడుతూ, బెదిరించారన్నారు. దీనికి నిరసనగా మద్నూర్ బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. అలాగే సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎస్సై కృష్ణారెడ్డి వినతిపత్రం అందజేశామన్నారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు.

వ్యాపారుల సమావేశం..

మద్నూర్ వ్యాపారులు శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, కమిటీ నిర్ణయం మేరకే బంద్ చేపడతామని సమావేశంలో వ్యాపారులు స్పష్టం చేశారు.

టీపీఎస్‌పై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కామారెడ్డి టౌన్: ఇంటికి అనుమతి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సిరిసిల్లారోడ్‌లోని ఎల్లమ్మ ఆలయం ఎదురుగా రాజశేఖర్ అనే వ్యక్తిని అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి దశరత్ తెలిపారు. విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన



తెయూ సౌత్ క్యాంపస్‌లో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు

భిక్కనూరు: రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సౌత్ క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు నిరసన చేపట్టారు. కాంట్రాక్టు అధ్యాపకుల రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా మాట్లాడుతూ... అసెంబ్లీలో తమ సమస్యల గురించి ఎమ్మెల్యే గాదారి కిషోర్ ప్రస్తావించినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. కిషోర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకులు యాలాద్రి, నర్సయ్య, రమాదేవి, సునీత, నిరంజన్ శర్మ, సరిత, శ్రీకాంత్, శ్రీమాత, దిలీప్‌లు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు కోరారు. పట్టణంలో భవన నిర్మాణ కార్మికులు శనివారం సంఘం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. సంఘం జెండాను సంఘ నాయకులు శ్యాం, లక్ష్మణ్‌లు ఎగరవేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బాబు, సాయిబాబా తదితరులు ఉన్నారు.

పాఠశాలకు వంట సామగ్రి వితరణ

రామారెడ్డి (ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు శనివారం యోగా కార్యక్రమాలు నిర్వహించే 5:30 బ్యాచ్ సభ్యులు ప్లేట్లు, గ్లాసులు ఇతర సామగ్రిని అందజేశారు. సర్పంచ్ సంజీవ్, ఉప సర్పంచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉప్పల్‌వాయి పాఠశాలలో మన ఊరు– మన బడి పథకం కింద ఏర్పాటు చేసిన స్మార్ట్ టీవీని సర్పంచ్ గంగారం ప్రారంభించారు,